ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

- ఇరుకు స్థలంలోనే సంతల నిర్వహణ
- ప్రజలు, మూగజీవాలకు తప్పని తిప్పలు


వాటర్ ట్యాంక్ వద్ద పేరుకుపోయిన మురికి


ఇరుకు స్థలంలో కొనసాగుతున్న మేకల సంత

సంతలకు వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)

సంత పేరు	2022-23	2023-24	2024-25	2025-26
మేకలు	33.70	55.16	40.51	61.31
కూరగాయలు	10.64	15	5.19	14.01

నవీపేట : మండల కేంద్రంలో నడి బొడ్డున ఉన్న సంత ప్రాంగణంలో ప్రతి శుక్రవారం వారాంతపు కూరగాయలు, ప్రతి శనివారం ఉత్తర తెలంగాణలో పేరుగాంచిన మేకల సంతలు జరుగుతాయి. ఆరెక రాల సంత ప్రాంగణం మీద నేటికీ కబ్జాదారుల కన్ను పడుతూనే ఉంది. అధికారుల అలసత్వం..పాలకుల నిర్లక్ష్యం..వెరసి ఆరెకరాల సంత ప్రాంగణం కాస్త మూడెకరాలకు కుచించుకుపోయింది. ప్రతి యేటా ఈ రెండు వేలం పాటలకు అధికారికంగా వేలం నిర్వహిస్తూ ఇక్కడే సంతలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది రూ.లక్షల్లో ఆదాయం సమకూరుస్తున్న సంతపై పాలకవర్గాలు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. సంతలో కనీసం తాగు నీటి సౌకర్యం లేదు. సంత జరిగే రోజున తాత్కాలికంగా నీటి డబ్బాలలో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సంత ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో క్రయవిక్రయాలు రెట్టింపవడంతో ఈ సమస్య తీవ్రం అవుతుంది.

సాటాపూర్ టు నవీపేట..

రెండు దశాబ్దాల కిందట రెంజల్ మండలంలోని సాటాపూర్‌లో కొనసాగే మేకల సంతలో సమస్యలు పరిష్కారం కావడం లేదని విసుగుచెందిన వ్యాపారులు ప్రత్యామ్నాయం వైపు చూశారు. అప్పుడే నవీపేటకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఇక్కడికి మార్చారు. సాటాపూర్ వీడీసీ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించడంతో కొన్నేళ్లు అనధికారికంగా వేలం నిర్వహించి సంతను నడిపారు. నవీపేటకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో కొన్నేళ్ల నుంచి అధికారికంగా వేలం నిర్వహిస్తున్నారు.

ప్రాంగణాన్ని మార్చాలని స్థానికుల డిమాండ్

ఈ సంతలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంత ప్రాంగణం చుట్టూ ఆర్టీసీ బస్టాండ్, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రధాన వ్యాపార కూడళ్లు, జనావాసాలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వర్షాకాలంలో ఈ సంతతో వ్యాధులు ప్రబలుతున్నాయని కొందరు గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి కలెక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ స్థలాన్ని మార్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆమె బదిలీపై వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. కానీ ఇటీవల నిర్వహించిన వేలం పాటలను స్థానిక నాయకులు, యువకులు ఆరంభంలో అడ్డుకున్నారు. సంతను వేరే చోటుకు మార్చాలని నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



సంతలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. వ్యాపారులు, వినియోగదారులు, ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తాం. సంత ఆవరణలో సీసీ వేస్తే జీవాల రెట్టలకు ఇబ్బంది అవుతుందని వేయలేదు. సంత ప్రాంగణాన్ని మార్చేందుకు అనుకూల ప్రదేశాన్ని చూస్తున్నాం. ఆశానగర్, నవీపేట, పోతంగల్ శివారులో 3 ప్రదేశాలను ప్రతిపాదించాం.

– రవీందర్ నాయక్, జీపీ కార్యదర్శి, నవీపేట

సంత ప్రాంగణాన్ని మార్చాలి



ప్రతి శనివారం వాహనాలు, వ్యాపారులు, వినియోగదారులు, జీవాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాలంటే చాలా కష్టం అవుతోంది. సంత ప్రాంగణాన్ని వేరే చోటుకు మార్చాలని అధికారులను నిలదీయగా మారుస్తామని హామీ ఇచ్చారు. మార్చకపోతే మళ్లీ ఆందోళన చేస్తాం.

– బూనాది ప్రవీణ్, నవీపేట

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


ముప్కాల్ ఠాణా వద్ద బీజేపీ నాయకులు


మోతెలో బీఆర్ఎస్ నేత రాజేశ్వర్‌రెడ్డి

బాల్కొండ: రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ నాయకులు తరలి వెళ్లకుండా ముందస్తుగానే ముప్కాల్ పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేల్పూర్‌లో బీఆర్ఎస్ నేత..

వేల్పూర్: పసుపునకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ జగిత్యాల జిల్లా రైతు కమిటీ ఇచ్చిన పిలుపుతో సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరుతున్న వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొల్ల రాజేశ్వర్‌రెడ్డిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆయన గతంలో రైతు జేఏసీలో సభ్యుడిగా ఉండడంతో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం పసుపు క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

చెల్లింపులు లేక.. నిర్మాణం పూర్తి కాక



- నత్తనడకన భీమ్‌గల్ వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం
- రూ.35 కోట్ల నిధులకు గాను రూ.13 కోట్ల చెల్లింపులే జరిపిన వైనం

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంతో పాటు చుట్టు పక్క పల్లెలకు వైద్య సేవలను విస్తృతం చేయడానికి నిర్దేశించిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఆస్పత్రి నిర్మాణ టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు చెల్లింపులు జరపడంలో తీవ్ర జాప్యం కావడటంతో నిర్మాణం పూర్తి కాలేకపోయింది. జూన్ 18, 2022లో అప్పటి మంత్రి హరీష్‌రావు ఈ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన ప్రశాంత్ రెడ్డి కూడా ఆస్పత్రి నిర్మాణానికి సహకారం అందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.35 కోట్ల నిధులు కేటాయించింది. భవన నిర్మాణం పనులు ఎంతో వేగంగా సాగినా ఇప్పటి వరకూ కేవలం రూ.13 కోట్ల చెల్లింపులే జరిపారు. దశల వారీగా చెల్లింపులు చేయాల్సి ఉన్నా నిధుల కొరత కారణంగా కాంట్రాక్టర్‌కు చెల్లింపులు నిలిచిపోయాయి. ఆసుపత్రి పనులు చివరి దశలో ఉన్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో పనుల్లో వేగం సన్నగిల్లింది.

వైద్య సేవలు అందుబాటులోకి ఎప్పుడో?

భీమ్‌గల్ పట్టణం చుట్టూ దాదాపు 40 గ్రామాలున్నాయి. సరైన వైద్య సేవల కోసం ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం ఆర్మూర్, నిజామాబాద్‌లకు వెళ్లాల్సి వస్తోంది. భీమ్‌గల్‌లోని వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వస్తే వేలాది మంది ప్రజలకు వైద్యం ఉచితంగా అందే అవకాశం ఉంది.

చిన్న చిన్న పనులు చేయిస్తున్నాం

ఆస్పత్రి భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని చూస్తున్నాం. బిల్లులు చెల్లింపులు జరిగితే పనులు పూర్తి చేయించి వైద్య విధాన పరిషత్‌కు స్వాధీనం చేస్తాం. చిన్న చిన్న పనులు సాగుతున్నాయి.

– అరవింద్, ఏఈ, వైద్యారోగ్య శాఖ ఇంజినీరింగ్ విభాగం

ఆర్మూర్‌కు నిధులు మంజూరు

ఆర్మూర్/మాక్లూర్: ఆర్మూర్ నియోజకవర్గానికి ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.3.48 కోట్లు మంజూరయ్యాయని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆలూర్ మండలానికి రూ.80 లక్షలు, ఆర్మూర్ మండలానికి రూ.కోటి 5 లక్షలు, డొంకేశ్వర్ మండలానికి రూ.25 లక్షలు, నందిపేట్ మండలానికి రూ.75 లక్షలు, మాక్లూర్ మండలానికి రూ.53 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఫీడర్ బ్రేకర్ ప్రారంభం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు ఏర్పాటు చేసిన ఫీడర్ బ్రేకర్‌ను సోమవారం ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ

నవీపేట: బోధకాల వ్యాధి నివారణలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం రాత్రి అనుమానితుల రక్త నమూనాలను సేకరించారు. ఈపాటికే 26 కేసులు నమోదవడంతో ముందస్తుగా వ్యాప్తిని అరికట్టేందుకు వైద్యశాఖ సిబ్బంది ఈ చర్యలు చేపట్టింది. 350 రక్త నమూనాలను సేకరించినట్లు సూపర్‌వైజర్లు కిషన్, వెంకటేశ్వర్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న విండో చైర్మన్ మల్కారెడ్డి

ఎడపల్లి(బోధన్): ఎడపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ పోల మల్కారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బి–గ్రేడ్‌కు రూ.2,300 ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. తహసీల్దార్ ధన్వాల్, వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, కార్యదర్శి రాజారాం, రైతులు సడక్ మోహన్, పోతన్న తదితరులున్నారు.

క్లుప్తంగా

పరీక్షా కేంద్రం తనిఖీ



రుద్రూర్: రుద్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యాధికారి అశోక్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వసతులు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఎంఈవో శ్రీనివాస్ ఉన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని పదవ తరగతి ఏ, బీ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి అశోక్ సందర్శించారు. పరీక్ష పూర్తయిన అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కోటగిరి మండల విద్యావనరుల కేంద్రం, కేజీబీవీని సందర్శించి పరిశీలించారు.

పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణానికి భారీ విరాళం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ సంఘం పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు సోమవారం గాజం రవీందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ నిర్మాణానికి సహాయం చేయాలని కోరారు. దీంతో వారు రూ.6లక్షలు విరాళం అందజేశారు. భవిష్యత్తులో తమ వంతు సహాయం ఇంకా అందిస్తామని ప్రకటించారు. ముదిరాజ్ సంఘం పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ గాజం మచ్చేందర్, వైస్ చైర్మన్ బోండ్ల సుమన్, పాల్గొన్నారు.

బాల్కొండ హైస్కూల్‌కు పది కంప్యూటర్లు



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పీఎం శ్రీ పథకం కింద పది కంప్యూటర్లను అందించారు. సోమవారం కంప్యూటర్లు పాఠశాలకు చేరాయి. ఈ సందర్భంగా ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడుతూ.. పాఠశాలలో కంప్యూటర్ విద్యను అమలు చేయటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించు కోవడం కోసం వినియోగించుకోవాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



మోర్తాడ్: పాలెంలో సోమవారం రాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గణపతి పూజ, పుణ్యవచనం, రుద్రాభిషేకం, సర్వతోభద్ర ఆరాధన, హోమం, పూర్ణాహుతిని నిర్వహించారు. వేద, జ్యోతిష్య పండిత్ రంజిత్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదానం చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



ఆర్మూర్ టౌన్: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద సోమవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనను పాటించాలని, వాహన ధ్రువీకరణ పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని, అలాగే 32 మందికి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.

నారాయణ పాఠశాలలో అమ్మకు వందనం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలలో 'అమ్మకు వందనం' అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రజని కుమారి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పట్ల గౌరవం, కృతజ్ఞత భావనను విద్యార్థుల్లో అలవాటుగా పెంచాలనేదే కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఏజీఎం శివాజీ, ఉపాధ్యాయులు నరేష్, సందీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రైతు రుణమాఫీ పూర్తిగా చేయాలి

ఆర్మూర్‌టౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జేఏసీ రైతుల నాయకుడు ఇట్టడి లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో రైతు సంఘాలు 'చలో అసెంబ్లీ' నిర్వహించాగా పోలీసులు అరెస్టులు చేయడం సరికాదన్నారు.

నేడు తైబజార్ వేలం పాట

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 11 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి గంగా జమున తెలిపారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని వెల్లడించారు.


రేపు భీమ్‌గల్ మున్సిపాలిటీలో..

మోర్తాడ్: భీమ్‌గల్ మున్సిపాలిటీలో తైబజార్ వేలం పాటను బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. ఈ తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 లక్షల డిపాజిట్ సొమ్మును కమిషనర్, మున్సిపాలిటీ భీమ్‌గల్ పేరిట డీడీ తీసుకుని రావాలని తెలిపారు. అలాగే రూ.3 లక్షల విలువ చేసే సాల్వేషన్ సర్టిఫికెట్‌ను అందించాలని సూచించారు.

ఉదారతను చాటిన స్వాములు

రుద్రూర్: పోతంగల్ మండలంలోని హంగర్గాకు చెందిన హన్మాన్ మాలధారణ స్వాములు ఉదారతను చాటారు. కల్లూర్ గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి బీర్కూర్ గంగారాం(హన్మాన్ మాలాధారణ స్వామి) నివాసపు ఇల్లు దగ్ధమైనట్టు తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు అందజేశారు. గురు స్వామి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో తాగునీటి కష్టాలు


కాలనీలోని భగీరథ పైప్ లైన్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని దయానంద్ నగర్, లక్ష్మీనారాయణ మందిరం ప్రాంతంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు వారం రోజులుగా రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 50 కుటుంబాలు ప్రతి రోజు ఇతర వార్డుల్లోకి వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలుమార్లు సంబంధిత అధికారులకు తమ సమస్యను విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

వారం నుంచి నీరు రావడం లేదు



వారం రోజుల నుంచి నీరు రావడం లేదు. ఉదయం నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. పక్క కాలనీలో నుంచి నీరు పట్టుకొని తెచ్చుకుంటున్నాం. – రాము, లక్ష్మీనారాయణ మందిరం

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



బాల్కొండ : మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి– 44 పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటంతో సోమవారం సాక్షి దినపత్రిక 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్' అనే శీర్షికన వార్త ప్రచురించడంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సోమవారం కంచె ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కరెంటు కోతలతో పంటలు ఎండుతున్నాయ్


దేవక్కపేట్‌లో పంటను పరిశీలిస్తున్న నేతలు

మోర్తాడ్: భూగర్భ జలాలున్నా పంటలకు సాగు నీరు అందించడానికి విద్యుత్ సరఫరా సరిగా సాగడం లేదని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆరోపించారు. సోమవారం భీమ్‌గల్ మండలంలోని గంగరాయి, దేవక్కపేట్, రాంచందర్‌పల్లె, తాళ్లపల్లి, రహత్‌నగర్, దేవన్‌పల్లిలలో పర్యటించి ఎండిపోతున్న వరి పంటను పరిశీలించారు. ఎండిపోతున్న పంటలకు ఎకరానికి రూ.30వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు దేవారాం, రామకృష్ణ, రాజేశ్వర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణతో ఆదాయం

- ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్


మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యులు, నేతలు

ఆర్మూర్: పశువుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ పోషించడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్ పేర్కొన్నారు. ఆలూరు మండల కేంద్రంలో ఆర్మూర్ ఏఎంసీ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్య సంరక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య శిబిరాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ సందీప్ రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ జీవన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి సహకరించాలి


మాట్లాడుతున్న పత్తి రాము

రుద్రూర్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ రామ మందిరం పనులకు సహకారాన్ని అందించాలని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు. పనులు చేపట్టి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం గ్రామస్తులు, దాతలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఇప్పటి వరకు విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అర్చకులు నారాయణ శర్మ, రామ శర్మ, భాను పంతులు, శ్రీ రామాలయ కమిటీ నిర్మాణ కమిటీ సభ్యులు పత్తి రాము, అడ్ప నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నన్నేసాబ్

రుద్రూర్: సమస్యల సాధనకు నేడు నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి భారీగా హాజరు కావాలని జీపీ కార్మికులకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ పిలుపునిచ్చారు. రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం జీపీ కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించి, రూ.26 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి యేషాల గంగాధర్, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో ప్రతిభ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పరమేశ్వ నృత్య కళా నిలయం కళాకారులు నృత్య పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు సొంతం చేసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది విశిష్ట పురస్కార నృత్య పోటీల్లో కళాకారులు వి. శివాణి, జె.నమ్రత, బి.భవ్యశ్రీ, ఏ.లరణ్య, కె.మధుశ్రీ, సీహెచ్.అక్షర, జె.రిషిప్రియ, కె.మిథిలాదేవీ, పి.చైత్ర, టి.భువనేశ్వరీలు పాల్గొని తమ నాట్యం ప్రదర్శించారు. నాట్య గురువు శిరీషను అభినందించారు.

సరఫరా అవుతోన్న మిషన్ భగీరథ నీరు



తాగు నీరా .. గరళమా..?

బాల్కొండ : వన్నెల్(బి)లో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితంగా వస్తోంది. నీరు పూర్తిగా నలుపు రంగులో రావడంతో పాటు చెత్త వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

డొంకేశ్వర్(ఆర్మూర్): వేసవి నేపథ్యంలో అధికారులు గ్రామ పంచాయతీలు, ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. డొంకేశ్వర్ మండలంలోని జీపీలలో పంచాయతీ కార్యదర్శులు చలివేంద్రాలను సోమవారం ప్రారంభించారు.

పల్లికొండ, బడాభీంగల్‌లో..

మోర్తాడ్: వేసవిలో దప్పిక తీర్చడానికి చలివేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్ అన్నారు. సోమవారం పల్లికొండ, బడాభీమ్‌గల్‌లలో చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎంపీవో జావిద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 ఓ అందాల రాక్షసి 11.00, కిస్ కిస్ కిస్సిక్ 1.45, 7.35, ఆర్టిస్ట్ 4.35, 10.25

స్క్రీన్-2 ఛావా10.00, 4.00, 10.00, షణ్ముక 1.20, 7.20

స్క్రీన్-3 సలార్–పార్ట్–1 10.00, 4.05, 10.10, పెళ్ళికాని ప్రసాద్ 1.30, 7.35

స్క్రీన్-4 కోర్ట్ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్ ధరలు (కిలోకు)		డ్రెస్స్‌డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,900	వెండి(కిలో)	1,04,500
22 క్యారెట్స్	83,897		

– నిజామాబాద్ బిజినెస్